క్లుప్తంగా

అపార్థం చేసుకోవద్దు

బీఆర్‌ఎస్‌ నాయకుడు క్యామ మల్లేశ్‌

మంచాల: ఆరుట్ల గ్రామంలోఈనెల 18న నిర్వహించిన బీఆర్‌ఎస్‌ ఎన్నికల ప్రచార సభలో ఎవరినీ కించపర్చే విధంగా మాట్లాడలేదని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాను బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా.. అంబేడ్కర్‌ వాదిగా ఎప్పుడు, ఎవరినీ, ఏ పార్టీని విమర్శించలేదన్నారు. కొందరు తనపై ఆరోపణలు చేసిన్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అపార్థం చేసుకొని మనస్సు నొప్పించుకోవద్దని సూచించారు.

శంభో శంకర..



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: కార్తీకమాసం సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ కార్తీకమాసం పర్వదినాల్లో శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ మామూలుగా ఉండదు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలోని పలు ఆలయాలకు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. పట్టణంలోని భక్తమార్కండేయస్వామి ఆలయం, పాత శివాలయాలను కార్తీకమాసం నేపథ్యంలో అలంకరించారు. ఉదయాన్నే శివుడికిఅభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



సత్తయ్య (ఫైల్‌)

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ హోంగార్డు మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని పోచారం సమీపంలో సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం..కందుకూరు మండలం కొలన్‌గూడకు చెందిన ఎ. సత్తయ్య (50) హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డ్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీకి బైక్‌పై వెళ్తున్న క్రమంలో పోచారం సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్నేహారెడ్డి ప్రచారం

ఇబ్రహీంపట్నం రూరల్‌: ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని రంగారెడ్డి కోడలు స్నేహారెడ్డి అభ్యర్థించారు. సోమవారం రాత్రి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్‌లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్‌ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, హస్తం గుర్తుకు ఓట్లు వేసి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ ఆర్తికగౌడ్‌, కాంగ్రెస్‌ నాయకులు లింగ్లళ్ల మహేందర్‌, రమేశ్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

జీవాలను రక్షించుకోవాలి

షాబాద్‌: వ్యాధుల నుంచి జీవాలను రక్షించుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని మక్తగూడ గ్రామంలో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. సీజనల్‌ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

గెలిపించండి.. మీతోనే ఉంటా



కడ్తాల్‌: ప్రచారంలో ప్రజనుద్దేశించి ప్రసంగిస్తున్న నారాయణరెడ్డి



తలకొండపల్లి: కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

- ఎమ్మెల్యేగా గెలిస్తే.. సేవ చేస్తా
- కల్వకుర్తిలో కాంగ్రెస్‌ జెండా ఎగురవేద్దాం
- జైపాల్‌యాదవ్‌ విఫల నేత
- కాంగ్రెస్‌ అభ్యర్థి నారాయణరెడ్డి
- 'హస్తం' గూటికి నాయకులు

కడ్తాల్‌: 'వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను గెలిపించండి. మీతోనే ఉంటూ సేవ చేస్తా' అని కల్వకుర్తి కాంగ్రెస్‌ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే పోటీలో నిలబడ్డానని తెలిపారు. కల్వకుర్తి గడ్డపై కాంగ్రెస్‌ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని కొండ్రిగానిబోడ్‌తండా, పెద్దారెడ్డిచెరువుతండా, మద్దెలకుంట, మక్తమాధారం, రావిచేడ్‌ గ్రామాల్లో ఐకృత ఫౌండేషన్‌ చైర్మన్‌ రాఘవేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, వైఎస్సార్టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డితో కలిసి కసిరెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అభివృద్ధిని విస్మరించిన జైపాల్‌యాదవ్‌

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, మాటలు తప్పా ఆయన చేసిందేమి లేదని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో పెండింగ్‌లో ఉన్న కాల్వ నిర్మాణ పనులను ఇంకా పూర్తి చేయలేదని దుయ్యబట్టారు. రాబోయేది కాంగ్రెస్‌ ప్రభుత్వమేనని అధికారంలోకి వచ్చిన వెంటనే 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరిక

మక్తామాధారం, రావిచేడ్‌ గ్రామాల్లో మార్కెట్‌ డైరెక్టర్‌ నర్సింహాగౌడ్‌, నాయకులు జలంధర్‌రెడ్డి, లాయక్‌, వాచ్యానాయక్‌, బీమ్లానాయక్‌, నరేశ్‌, శ్రీను, మహేందర్‌, యాదయ్యతో పాటు వివిధ పార్టీల నాయకులు నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు బీచ్యానాయక్‌, కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడు బాలరాజ్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌లు డాక్టర్‌ శ్రీనివాస్‌, వెంకటేశ్‌ పాల్గొన్నారు.



జంగారెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న సుంకిరెడ్డి

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేసి అఖండమైన మెజార్టీతో గెలిపించాలని కసిరెడ్డి నారాయణరెడ్డి అభ్యర్థించారు. ప్రజలు కాంగ్రెస్‌ వైపు మొగ్గు చూపుతున్నారని, అందువల్లే వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మండల పరిధిలోని సూర్యతండా, హర్యానాయక్‌ తండా, లక్ష్మీతండాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం ఖానాపూర్‌లో కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు. సీఎం కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఈ సారి బీఆర్‌ఎస్‌కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మాడ్గుల: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఎంపీపీ పద్మారెడ్డి ధీమావ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని గిరికొత్తపల్లి, దొడ్లపహాడ్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌ వెంకటేశ్వర్‌గౌడ్‌ సింగిల్‌ విండో డైరెక్టర్‌ జగన్‌గౌడ్‌, నాయకులు గోపాల్‌రెడ్డి, రాజురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శంకర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

కసిరెడ్డిని గెలిపించండి

ఆమనగల్లు: కసిరెడ్డి నారాయణరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకుడు, ఐక్యత ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం కసిరెడ్డికి మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. అధికారంలోకి వస్తే అందరికీ న్యాయం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు గుర్రం కేశవులు, ధనుంజయ, పాలకుర్ల రవికాంత్‌గౌడ్‌, వస్పుల మానయ్య, అనిల్‌గౌడ్‌, ఖాదర్‌ఖాద్రి, ఖాదర్‌, కృష్ణనాయక్‌, కృష్ణయాదవ్‌, గబ్బర్‌యాదవ్‌, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ ర్యాలీ

ఆమనగల్లు: పట్టణంలో నారాయణరెడ్డికి మద్దతుగా సోమవారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో మోటార్‌ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీలు, ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, కసిరెడ్డిని గెలిపించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, వస్పుల మానయ్య, కృష్ణనాయక్‌, శివలింగం, ప్రసాద్‌, అలీం, నాసర్‌, ఫరీద్‌, వస్పుల శ్రీకాంత్‌, కాలె మల్లయ్య, ఖాదర్‌, ఖరీం, మల్లేశ్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు

పట్నంలో ప్రచార హోరు

- గ్రామాల్లో దూకుడు పెంచిన అభ్యర్థులు
- పగటిపూట ప్రచారం.. రాత్రిళ్లు వ్యూహాలు
- కళాకారుల ఆటపాటలతో విస్తృత ప్రచారం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార హోరు కొనసాగుతోంది. పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచార రథాలు వాడవాడలా తిరుగుతున్నాయి. కళాకారుల ఆటపాటలతో ఆయా పార్టీల మేనిఫెస్టోలను ప్రచారం చేస్తూ ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీల అభ్యర్థులు పోటీలో తలపడుతున్నారు. గులాబీ పార్టీ అభ్యర్థిని ముందే ప్రకటించడంతో ఆ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సీఎం కేసీఆర్‌ సభతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. కాంగ్రెస్‌ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

సుడిగాలి పర్యటనలు

మల్‌రెడ్డి రంగారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పగటిపూట ప్రచారం చేస్తూ.. రాత్రిళ్లు వ్యూహాలు రచిస్తూ బిజీగా ఉన్నారు. రోడ్డు షోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. తాము గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని హామీలు గుప్పిస్తున్నారు. అంతేకాకుండా అభ్యర్థుల కుటుంబసభ్యులు కూడా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.



ఇబ్రహీంపట్నం: ఎన్నికల ప్రచారంలో దప్పు కళాకారులు

నిర్భయంగా ఓటేయండి



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్‌ శ్యాంసుందర్‌

- మున్సిపల్‌ కమిషనర్‌ శ్యాంసుందర్‌

ఆమనగల్లు: అర్హులైన వారందరూ ఈ నెల 30న ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమనగల్లు మున్సిపల్‌ కమిషనర్‌ శ్యాంసుందర్‌ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు కాలనీల్లో మున్సిపల్‌ సిబ్బందితో కలిసి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ రహదారిపై రాజీవ్‌ చౌరస్తా వద్ద ప్రజలతో ఓటుహక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటును ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలని ఆయన సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లందరికీ ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం జంగయ్య, మున్సిపాలిటీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్‌: సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్‌ రమాదేవి అన్నారు. సోమవారం మండలంలోని తోల్‌కట్ట సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ నెల 18న సరూర్‌నగర్‌ ఇండోర్‌ స్టేడియంలో 67వ ఎస్‌జీఎఫ్‌ రంగారెడ్డి జిల్లా లెవల్‌ టోర్నమెంట్‌, కామన్‌ సెలక్షన్స్‌ 2023–24 నిర్వహించారు. ఈ పోటీల్లో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌లో లాంగ్‌ జంప్‌ అండర్‌–17 విభాగంలో రక్షిత(8వ తరగతి) 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. అలాగే, అండర్‌–14 విభాగంలో ఎస్‌.వైష్ణవి(7వ తరగతి) అథ్లెటిక్స్‌ 100, 200 మీటర్ల విభాగంలో 2వ స్థానంలో వెండి పతకం సాధించగా లాంగ్‌ జంప్‌లో రెండవ స్థానంలో నిలిచింది. గెలుపొందిన రక్షిత, వైష్ణవిలను రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ రమాదేవి

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్‌

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కాంచనలత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ధన్వంతరి ట్రస్ట్‌, జియో ఫైబర్‌ కంపెనీల ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరియర్‌ గైడెన్స్‌ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ ఉషారాణి మాట్లాడుతూ.. గుండెపోటు సంభవించినప్పుడు చేపట్టే సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ కాంచనలత మాట్లాడుతూ.. డిగ్రీ చదువుతునే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించవచ్చునని తెలిపారు. జియో ఫైబర్‌ కంపెనీలో విద్యార్థులు పార్ట్‌టైంగా ఉపాధి పొందే అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు పాఠశాలలో కనీస అవగాహన కల్పించి వారిని చదువులో చురుకుగా ఉండేలా తీర్చిదిద్దేందుకు కళాశాల విద్యా కమిషనర్‌ ఆదేశాల మేరకు 'పిల్లల కోసం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ద్వారా 73 మంది విద్యార్థులు దీనిపై శిక్షణ పొందినట్లు చెప్పారు. వీరిలో 41 మంది విద్యార్థులను వివిధ పాఠశాలలకు కేటాయించడం జరిగిందన్నారు. దీనికోసం విద్యార్థులు ముందుకు వచ్చి శిక్షణ పొందడం అభినందనీయమని పేర్కొన్నారు.

పాలనలో బీఆర్‌ఎస్‌ విఫలం

- బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌

మీర్‌పేట: మంత్రికి శిలాఫలకాలపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని బీజేపీ మహేశ్వరం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ ఆరోపించారు. సోమవారం మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధి గాయత్రినగర్‌లోని శ్రీరామ ఆలయం నుంచి జిల్లెలగూడ వరకు ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్లీకో బెల్టుషాపు, విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నా కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది బీజేపీ అని గుర్తుచేశారు. ప్రచారంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహరెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శులు మధు, సోమేశ్వర్‌ నాయకులు దశరథ, సబిత, అమర్‌నాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పద్మనర్సింహ, భీంరాజ్‌, భిక్షపతిచారి, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములును గెలిపించండి

హుడాకాంప్లెక్స్‌: మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌కు మద్దతుగా సరూర్‌నగర్‌ డివిజన్‌ భగత్‌సింగ్‌నగర్‌లో గోవా ఎమ్మెల్యే కేదార్‌ జయప్రకాశ్‌ నాయక్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్‌ ఆకుల శ్రీవాణి సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, స్థానికుడైన అందెల శ్రీరాములుకు అవకాశం ఇవ్వాలని కోరారు.



హుడాకాంప్లెక్స్‌: భగత్‌సింగ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న గోవా ఎమ్మెల్యే జయప్రకాశ్‌

స్థానికుడికే పట్టం

తుక్కుగూడ: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులలో స్థానికునికే మహేశ్వరం ప్రజలు పట్టం కట్టాలని బీజేపీ తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్‌ కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సబితారెడ్డి, కాంగ్రెస్‌ అభ్యర్థి కేఎల్లార్‌ ఇద్దరూ చేవెళ్ల వాసులున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్‌, యాదగిరిరెడ్డి నాయకులు భాస్కర్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

తుక్కుగూడ: మహేశ్వరం బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను గెలిపించాలని కౌన్సిలర్‌ శివకుమార్‌ ప్రచారం నిర్వహించారు. సోమవా రం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డు లో ఇంటింటికీ తిరిగారు. కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికార కాంక్షతో అమలు కాని హామీలు

- కాంగ్రెస్‌ మేనిఫెస్టోపై మంత్రి సబితారెడ్డి ఫైర్‌
- కందుకూరులో ఎన్నికల ప్రచారం



కందుకూరు: తిమ్మాపూర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చే హామీలు నమ్మితే మోసపోతారని విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సబితారెడ్డి ఆరోపించారు. పార్టీ టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్‌ నాయకులు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే తాకట్టు పెడతారని ఎద్దేవా చేశారు. మండలంలోని సరస్వతిగూడ, లేమూరు, తిమ్మాపూర్‌, జబ్బార్‌గూడ, బేగంపేట, అగర్‌మియాగూడ, రాచులూరు, బైరాగిగూడ, కొత్తూర్‌ గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందన్నారు. నిత్యావసర సరకులు విపరీతంగా పెంచిన బీజేపీ ఏ మొహం పెట్టుకుని ప్రజల ముందుకు వస్తుందన్నారు. కాంగ్రెస్‌, బీజేపీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇస్తున్న హామీలను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. కేవలం అధికారాన్ని పొందాలన్న కాంక్షతో సాధ్యంకాని హామీలు గుప్పిస్తున్నారన్నారు. పింఛన్‌ రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచనున్నామని, గ్యాస్‌ సిలిండర్‌ను రూ.400లకే అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మోకాలు చిప్ప ఆపరేషన్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయిస్తున్నామన్నారు. రేషన్‌ షాపుల్లో సన్న బియ్యం సరఫరా చేయనున్నామన్నారు. తాము ఇచ్చే అన్ని హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తామన్నారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని, కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం గుమ్మడవెల్లితో పాటు పలు గ్రామాల నుంచి పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మేఘనాథ్‌రెడ్డి నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, గణేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌, విజేందర్‌రెడ్డి, శోభాగౌడ్‌, సర్పంచులు రాము, పరంజ్యోతి, గోపాల్‌రెడ్డి, సుగుణమ్మ, గోవర్ధన్‌, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి ఎంపీటీసీలు యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

మహేశ్వరం: సబితమ్మ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే భారీ మెజార్టీతో గెలిపిస్తాయని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కల్వకోల్‌ గ్రామ సర్పంచ్‌ గాదె థామస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి సబితారెడ్డికి మద్దతుగా మండలంలోని కల్వకోల్‌, కేకే బస్తీ, అమీర్‌పేట్‌, నాగారం, దుబ్బచర్ల, ఘట్టుపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సబితారెడ్డి రూ.వందల కోట్ల నిధులతో ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి 75 గజాల ఇంటి స్థలం, డబుల్‌ బెడ్‌ రూమ్స్‌, దళిత బంధు కింద రూ.10 లక్షల సహాయం అందించారన్నారు. సబితమ్మ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు.

పథకాల ఘనత బీఆర్‌ఎస్‌దే

దిల్‌సుఖ్‌నగర్‌: పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్‌ఎస్‌దే అని ఆ పార్టీ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌లో సోమవారం సబితారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ మోసపూరిత మాటలు ప్రజలు నమ్మ కూడదన్నారు. ఎన్నికల్లో సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌, ఫరీద్‌పాషా, శ్రీనివాసముదిరాజ్‌, వెంకటేష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

'పట్నం' గడ్డ మంచిరెడ్డి అడ్డా

- ఎంపీపీ కృపేశ్‌

ఇబ్రహీంపట్నంరూరల్‌: ఇబ్రహీంపట్నం గడ్డా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అడ్డా అని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్‌ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు, మెటిల్లా గ్రామాల్లో కృపేష్‌, వైస్‌ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్‌ గ్రామంలో ఎమ్మెల్యే కుమార్తె శీతల్‌ ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి మారుపేరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కప్పపహాడ్‌ సర్పంచ్‌ హంసమ్మ, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ మునీర్‌, నిట్టు జగదీశ్వర్‌, ఎల్మినేడులో ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్‌ చైర్మన్‌ మహేందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింహాలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మంచిరెడ్డి మౌనిక ప్రచారం

మంచాల: మండల పరిధిలోని చిత్తాపూర్‌ గ్రామంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మంచిరెడ్డి మౌనిక సోమవారం ఉదయం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి కిషన్‌రెడ్డి చేసిన కృషిని గుర్తించి మరోసారి ఎమ్మెల్యేగా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమెతో పాటు మంచాల ఎంపీపీ నర్మద, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ చంద్ర య్య, సర్పంచ్‌ బొడ్డు నాగరాజ్‌ గౌడ్‌ మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన జుట్టు శ్రీశైలం



కప్పపహాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంచిరెడ్డి శీతల్‌

యాచారం: బీజేపీ రాష్ట్ర నాయకుడు జుట్టు శ్రీశైలం సోమవారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌ కండువా కప్పుకున్నారు. శ్రీశైలంతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి పాశ్చ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఇబ్రహీంపట్నం 1వ వార్డు, 158 పోలింగ్‌ బూత్‌ పరిధిలో సోమవారం బూత్‌ ఇన్‌చార్జి కంచకట్ల భాస్కర్‌ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు గడప గడపకూ వెళ్లి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్‌, కిషన్‌రెడ్డి ఇబ్రహీంపట్నంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. మంచిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నేతలు